# ప్రజాశక్తి

శుక్రవారం 15 సెప్టెంబర్ 2023 | 5 | అనంతపురం

కెనాల్‌లో పూడిక తీస్తున్న హిటాచి

## రైతుల సొంత ఖర్చులతో కెనాల్‌లో పూడికతీత

**ప్రజాశక్తి-ఉరవకొండ**

విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ గ్రామ రైతులు తమ సొంత ఖర్చులతో కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టారు. ఎం.తిమ్మాపురం గడేకల్ కడదర బెంచి హెచ్ఎంసి కెనాల్‌లో కంపచెట్లను తొలగించడంతోపాటు పూడికతీత పనులు చేపట్టాలని డోనేకల్ గ్రామాల రైతులు పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు చివరికి చేసేది లేక రైతులందరూ కలిసి సొంతంగా హిటాచి ఏర్పాటు చేసుకుని పూడికతీత పనులు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపింగ్ పడకుండా కంపచెట్లను తొలగించడంతోపాటు పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# మొక్కుబడిగా ఐఎబి..!

- ఒకేసారి మూడు సమావేశాలు
- సగం మంది అధికారులు బయటే
- మీడియాకు అనుమతి లేదు

జిల్లా సాగునీటి పరిస్థితిపై మంత్రి పెద్దిరెడ్డికి వివరిస్తున్న జిల్లా మంత్రి ఉషశ్రీచరన్, కలెక్టర్ గౌతమి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

జిల్లాలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్ట రైతులే కాకుండా ఆయకట్టు రైతులకూ ఇక్కట్లు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితుల్లో సాగునీటిపైనా రైతుల్లో సర్వత్రా ఆత్రుత ఆందోళన నెలకొంది. ఈ సమయంలో ఇప్పటికే జరగాల్సిన సాగునీటి సలహామండలి సమావేశం ఖరీఫ్ సీజన్ మరికొద్ది రోజుల్లో ముగుస్తున్న సమయంలో ప్రభుత్వం సాగునీటి సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యలపై ఏమి చర్చించి, నిర్ణయాలు తీసుకుంటారోనని రైతులు ఆసక్తిగా ఎదురు చూశారు. కాని ఇంతటి కీలకమైన సమావేశాన్ని మొక్కుబడిగా ముగించారు. గురువారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయంలోని డిపిఆర్‌సి సమావేశం హాలులో సాగునీటి సలహామండలి, అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు మీటింగ్ రెండు కలిపి ఒకేసారి జరిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గౌతమి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలతోపాటు ఎంపిలు తలారి రంగయ్య, గోరంట్ల మధవ్‌లు పాల్గొన్నారు. రెండు సమావేశాలు ఒకేసారి జరపడంతో హాలు పట్టక చాలా మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఇతర అధికారులు బయటే నిలబడిపోవాల్సింది. దీని తరువాత రాప్తాడు నియోజకవర్గ సమీక్షను కూడా జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేయడంతో హడావుడిగా మూడు సమావేశాలను నిర్వహించారు.

### ప్రజాప్రతినిధుల స్పందన ఇలా...

ఐఎబి సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై ప్రస్తావన చేశారు. వారి నియోజకవర్గాల్లో సాగునీటి, తాగునీటి సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ హెచ్ఎల్‌సి పరిధిలో కేటాయించిన 26.828 టీఎంసీలలో 10 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని, మిగిలిన 16.828 టీఎంసీలను నీటిని ఆరుతడి ఆయకట్టుకు సరఫరా చేసేలా చూడాలన్నారు. హెచ్.ఎన్.ఎస్.ఎస్ పరిధిలో కేటాయించిన 40 టీఎంసీలలో 4 టీఎంసీల నీరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు ఉపయోగించాలని సూచించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ వర్షభావ పరిస్థితుల్లో రైతులకు మేలు చేసే చర్యలు తీసుకోవాలన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు కింద పెండింగ్ భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే సాగు చేసిన ఉద్యాన, ఇతర పంటలు కాపాడుకోవాలన్నారు. ఇందుకోసం యాక్షన్ ప్రణాళిక రూపొందించాలన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో 300 కోట్ల రూపాయల ఖర్చుతో రెయిన్ గన్స్ కొనుగోలు చేశారని, అవి ప్రస్తుతం ఎన్ని ఉన్నాయన్న దానిపై పరిశీలన చేసి, దీనిపై విజిలెన్స్ విచారణ చేపించాలన్నారు.ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కేసీ కెనాల్ డైవర్షన్ కింద కేటాయించిన 10 టీఎంసీల నీటిని జిల్లా హక్కుగా ఖచ్చితంగా తీసుకోవాలన్నారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్ఎస్ కింద కేటాయించిన నీటిని ఆచితూచి వాడుకోవాలన్నారు. తాగునీటి కోసం కేటాయించిన నీటిలో హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్ఎస్ కింద 50 శాతం చొప్పున నీటిని తీసుకోవాలని, దీని ద్వారా ఆయకట్టుకు కూడా నీరు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కర్ణాటకలో కడుతున్న ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపేసేలా సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా చెరువులను నింపి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేస్2 కింద నీటిని విడుదల చేసి రాప్తాడు నియోజకవర్గంలోని చెరువులను నింపాలన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పీఏబీఆర్ కుడి కాలువ కింద ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో 16 చెరువులకు నీరు అందించాలన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ మిడ్ పెన్నార్ గేట్లు మరమ్మతులకు గురవుతున్నారని, నీరు వథా కాకుండా గేట్ల మరమ్మత్తులు చేపించాలన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

### మీడియాకు అనుమతి నిరాకరణ

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జరుగుతున్న సాగు, వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎటువంటి సమస్యలను లేవనెత్తారు, వాటి పరిష్కారానికి ఏ చర్యలు తీసుకున్నారన్నది ప్రజలకు చేరవేసేది మీడియా. అయితే ఇంతటి కీలకమైన సమయంలో జరుగుతున్న సలహా మండలి సమావేశానికి మీడియాకు అనుతినివ్వలేదు. ఐఅండ్‌పిఆర్ ద్వారా నోట్ పంపుతామని అక్కడికెళ్లిన మీడియా ప్రతినిధులకు సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఏమిటన్నది ఆ తరువాత ఐఅండ్‌పిఆర్ పంపిన నోట్‌లోనూ లేకపోవడం గమనార్హం. తాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు మాత్రమే పేర్కొన్నారు. హెచ్ఎల్‌సి కిందనున్న గుంతకల్లు బ్రాంచ్ కాలువకుగానీ, మిడ్‌పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారన్న అంశాలూ వెల్లడించకపోవడం గమనార్హం.

#### అన్నీ కాకి లెక్కలే...?

నీటి కేటాయింపులు చూస్తే అన్నీ కాకిలెక్కలేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022-23 సంవత్సరంలో మంచి వర్షాలొచ్చి దీంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు 36.50 టిఎంసిల నీరొచ్చింది. ఇందులో తాగునీటికి పది టిఎంసిలు కేటాయించగా, 28.821 టిఎంసిలు సాగునీటికి వినియోగించినట్టు అధికారిక నివేదికల్లో పేర్కొన్నారు. సాధారణంగా ఒక టిఎంసి నీటిని పది వేల ఎకరాల ఆయకట్టుకు అందివ్వ వచ్చునన్నది అధికారిక అంచనాయే. కాని గతేడాది 28.821 టిఎంసిలు సాగునీటిని వినియోగించమని చెబుతున్నప్పటికీ హెచ్ఎల్‌సి కింద సాగైన భూమి మాత్రం 85 వేల ఎకరాలు మాత్రమే. సాధారణంగా అయితే 2.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఈ నీరు సరిపోతుంది. సాగైంది 85 వేలు మాత్రమే కావడం గమనార్హం. ఇకపోతే ఈ ఏడాది 2023-24కుగానూ ఇప్పటికున్న పరిస్థితుల అంచనా ప్రకారం 26.828 టిఎంసిలు నీటి కేటాయింపులు జరిపారు. ఇదే వాతావరణ పరిస్థితులు కొనసాగితే మరో మూడు టిఎంసిలు తగ్గే సూచనలున్నట్టు కూడా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో పది టిఎంసిలు తాగునీటికిపోనూ 16 టిఎంసిలు సాగునీటికి కేటాయించారు. ఇందులో ఆరు టిఎంసిలు ప్రవాహ నష్టం జరుగనుంది. పది టిఎంసిలు మిగులుంది. ఈ పది టిఎంసిలతో ఈసారి లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరిస్తామని ప్రతిపాదించారు. గతేడాది 28 టిఎంసిలు వచ్చినా 85 వేల ఎకరాలకే నీరిచ్చారు. ఈసారి తక్కువ నీరొచ్చినా ఎక్కువ ఆయకట్టుకు ఏ విధంగా నీరిస్తారన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

## నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

### ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా నేటి నుంచి ప్రారంభం కానున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం అనంతపురం నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం 1, 2, 3 సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 30 వతేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి వైద్యసేవలు అవసరమైన వారిని గుర్తించాలని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 30వతేదీ వరకూ అన్ని సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాల్లో 14రకాల వైద్యసేవలు అందించి 105 రకాల మందులను ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షల తర్వాత అవసరమైతే ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు వైద్య చికిత్స నిమిత్తం తరలించాలన్నారు. తర్వాత ఆయా సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు ఎక్కడా లేకుండా చూడాలన్నారు. అంతకుముందు పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసిలు నాగేంద్ర, శృతి, మహబూబ్‌జాన్, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైసిపి నేతలు బి.మదన్‌మోహన్‌రెడ్డి, హాజీవలి, సత్తెన్న, బషీర్, గువ్వల రామకృష్ణారెడ్డి, బీవీ.సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద రాజకీయ ప్రసంగాలు నిషేధం : డీఎస్పీ

**ప్రజాశక్తి-తాడిపత్రి**

తాడిపత్రి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని వినాయక మండపాల ఎలాంటి రాజకీయ ప్రసంగాలు, నినాదాలు చేయకూడదని డీఎస్పీ గంగయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా కార్యనిర్వాహకులు బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే గాలివానలను దృష్టిలో ఉంచుకుని దృఢంగా మండపాలను నిర్మించుకోవాలన్నారు. రాత్రి 10 గంటల వరకూ మాత్రమే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. మండపాల వద్ద రాజకీయ ప్రసంగాలు, నినాదాలు చేయడం, మద్యం తాగడం, జూదం ఆడటం చట్టవిరుద్ధమైన చర్యలు అన్నారు. ఏ ముఖ్యమైన ఘటనలు జరిగినాన తక్షణమే 100 ద్వారా డీఎస్పీ సెల్..94407 96860, సీఐ సెల్..94407 96861, ఎస్ఐ సెల్.. 94407 96863 నెంబర్లకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐ లక్ష్మీకాంతరెడ్డి ఎస్ఐ ధరణి బాబు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

డా॥శివప్రియాంకరెడ్డిని అభినందిస్తున్న వైద్యాధికారులు

## పీజీలో స్టేట్ టాపర్ డా॥శివప్రియాంక

### గైనకాలజీలో బంగారు పతకం

**ప్రజాశక్తి-అనంతపురం**

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన పీజీ పరీక్షల్లో అనంత వైద్య కళాశాలలో గైనకాలజీ విభాగంలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ చేస్తున్న డాక్టర్ శివప్రియాంక ప్రతిభ చాటారు. 700 మార్కులకు గాను 527 మార్కులు సంపాదించి 75.29 శాతం ఉత్తీర్ణతతో డిస్టింక్షన్ సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో అందరికంటే ఎక్కువ మార్కులు పొందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థినిగా రాష్ట్ర స్థాయి టాపర్‌గా ఆమె నిలిచారు. వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ గైనకాలజీ గోల్డ్ మెడల్‌ను సాధించారు. కడప జిల్లా కాజీపేటకు చెందిన రామచంద్రారెడ్డి, నాగమ్మల కుమార్తె డాక్టర్ శివ ప్రియాంక. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆమె ఈ ఘనత సాధించింది. రాష్ట్ర స్థాయి బంగారు పతకం సాధించిన డా॥శివ ప్రియాంకను అనంత మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి అభినందించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నుంచి 186 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు గైనకాలజీ విభాగంలో పరీక్షలు రాయగా అందులో మొదటి స్థానంలో డాక్టర్ శివ ప్రియాంక నిలవడం అభినందనీయం అన్నారు. శివ ప్రియాంకకు గైడ్‌గా ఆచార్య డాక్టర్ సంధ్య వ్యవహరించారు. భవిష్యత్తులో ఇన్ ఫెర్టిలిటీపైన ఫెలోషిప్‌ను చేయాలనుకుంటున్నానని, ప్రసూతి విభాగంలో వచ్చే క్యాన్సర్లు, ప్రత్యుత్పత్తి వైద్య విద్యపైన సూపర్ స్పెషాలిటీ ఎంసిహెచ్ విద్యను చదవాలనుకుంటున్నానని డాక్టర్ శివ ప్రియాంక తెలిపారు. అనంత మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శివ ప్రియాంకను ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కెఎల్.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శారోన్ సోనియా, డాక్టర్ బిఆర్ శ్యాంప్రసాద్, గైనకాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ సంధ్య పుష్పగుచ్చాలు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

## నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

**నార్పల :** మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో పూర్తయిన 16 ప్రభుత్వ భవనాలను గురువారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం చాములూరు రైతు భరోసా కేంద్రం, నాయనపల్లి గ్రామ సచివాలయం, ఆర్‌బికె, హెల్త్‌సెంటర్, మధ్యాహ్నం నడిమిదొడ్డిలో ఆర్‌బికె, హెల్త్‌సెంటర్, బొందులవాడ ఆర్‌బికె కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## 'వన్‌నేషన్-వన్‌ఎలక్షన్' ప్రజాస్వామ్యానికి విఘాతం

### మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యకర్త ఏ.చంద్రశేఖర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

కేంద్ర ప్రభుత్వం ఎన్నికల నూతన సంవత్సరణలో భాగంగా ప్రతిపాదిస్తున్న 'ఒక దేశం-ఒకే ఎన్నిక విధానం' ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యకర్త ఏ.చంద్రశేఖర్ అన్నారు. గురువారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కొండయ్య అధ్యక్షతన ఎన్జీఓ హోమ్‌లో 'ఒక దేశం-ఒకే ఎన్నిక' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఒకే ఎన్నిక విధానం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. స్వార్థ రాజకీయం అధికారంలో ధీర్ఘకాలికంగా చేపట్టాలని కుటిల ఆలోచన చేస్తున్నట్లు ఉందన్నారు. సాద్యా సాధ్యాలు పరిశీలిస్తే ఒకే సారి దేశ వ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలంటే అత్యధిక సమయం పడుతుందని, ఎన్నికల నిర్వహణ సిబ్బంది, భద్రతా సిబ్బంది, ఇవిఎంలు ఇలా అన్ని కూడా అత్యధికంగా కావాల్సి ఉంటుందన్నారు. ఒకే సారి నిర్వహించాలంటే కనీసం 4 నెలలకు పైబడి వ్యవధి కావాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు దేశంలో ఈ మధ్య కాలంలోనే అసెంబ్లీ ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ఆ ప్రభుత్వాలు కూడా రిజాల్వ్ అయి ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంలో తిరిగి ఎన్నికల నిర్వహించాలంటే స్వాగతించ దగినది కాదన్నారు. ఈ విధానంతో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాల అధికారాలను గుప్పిట్లో పెట్టుకుని అజమాయిసి చేసే కుట్రలు అన్నారు. రాష్ట్రపతి పరిపాలన విధిస్తే గవర్నర్ చేతుల్లో పరిపాలన వెళుతుందన్నారు. దేశంలో గవర్నర్ వ్యవస్థ ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. ప్రజా మద్ధతుతో ఏర్పాటైన ప్రభుత్వాలను కూల దోసి మరో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న దుస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యేలు పశువుల కంటే క్షీణంగా అమ్ముడు పోయే వ్యవస్థ దాపురించిందన్నారు. ఈ క్రమంలో ప్రజా అభిప్రాయాలను ప్రతిభింబించే వేదికగా ఎన్నికల వ్యవస్థ నిలిచిందన్నారు. ప్రపంచ దేశాల్లో ప్రభుత్వాలను రీకాల్ చేసే ప్రజాస్వామ్య దేశాలు నేడు ఉన్నాయని, నేడు మన దేశంలో ఆ పరిస్థితులు లేవన్నారు. రాష్ట్రాల స్వేచ్ఛను హరించే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రాజ్యసభల హక్కులు కూడా హరించబడే రోజులు వచ్చాయని తెలిపారు. ఐదేళ్లకు ఒకసారైనా ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించి ప్రభుత్వాలను ఎన్నుకునే వెసులుబాటు ఉందన్నారు. ఒక దేశం ఒక ఎన్నిక విధానం వస్తే ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పరిపాలన కార్పొరేట్ శక్తుల చేతుల్లో వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఇది రాజ్యాంగానికి విరుద్ధం అన్నారు. దీన్ని ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కావున యథాతథంగా ఎన్నికల విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజి.రాజమోహన్, సభ్యులు ఎంఎన్‌టి.రాజు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప, మానవ హక్కుల వేదిక ఎస్ఎం.బాషా, బోస్, మానవ హక్కుల వేదిక నాయకులు అబ్దుల్ రసూల్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, యుటిఎఫ్ నాయకులు జిలాన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యకర్త ఏ.చంద్రశేఖర్

## సాగులో శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

### ఎన్‌జి.రంగా విద్యాలయం బోర్డు అధికారి ఎం.మల్లికార్జునరెడ్డి

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగుబడును సాధించవచ్చని ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బోర్డ్ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని రేకులకుంట దగ్గర ఉన్న వ్యవసాయ క్షేత్రంలో శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయ విశ్వవిద్యాలయం క్షేత్ర ప్రదర్శన చేశారు. ఇందులో భాగంగా పరిశోధనా స్థానంలో జరుగుతున్న మెట్ట వ్యవసాయం, సమగ్ర వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, వాతావరణం, వివిధ పంటలు, పశుపోషణలో జరుగుతున్న పరిశోధనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన స్థానంలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతులు కూడా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి సాగులో లాభాలు గడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం బోర్డు అధికారి బి.శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌జి.రంగ విద్యాలయం బోర్డు అధికారి ఎం.మల్లికార్జునరెడ్డి

## నిలకడ లేని వ్యక్తి పవన్‌కళ్యాణ్

### టిడిపి పొత్తుతో ఒరిగేదేమీ లేదు : ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

'పూటకో మాట రోజుకో గడప' జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీరు అని వరస అని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. గురువారం సాయంత్రం రాప్తాడు మండల కేంద్రంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూవైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. నిలకడ లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ధ్వజమెత్తారు. 2014లో పార్టీ పెట్టాడు కానీ పోటీ చేయలేదు. చంద్రబాబు జెండా పట్టుకుని దేశమంతా తిరిగాడు. ఆయనను గెలిపించాడు. చంద్రబాబు తరఫున వకాల్తా పుచ్చుకున్నాడు. చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తే ఆ మోసంలో ప్రధాన పాత్రదారి పవన్ కళ్యాణ్. 2019లో ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ పోటీ చేశాడు. ఆ సమయంలో చంద్రబాబు దోపిడీదారుడు, దుర్మార్గుడు, లక్ష కోట్లు తిన్నాడంటూ ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. మరి ఈరోజు సిగ్గు లేకుండా అదే చంద్రబాబుతో కలిసి ఒప్పందం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి జంటగా జనాల్ని మోసం చేసేందుకు వస్తున్నారు. సొంతంగా పార్టీ పెట్టి జెండా అజెండా లేని వ్యక్తి పవన్ కళ్యాణ్. తాను సీఎం అభ్యర్థి అని చెప్పుకోలేని వ్యక్తి. ఎంతసేపూ చంద్రబాబు భజన పాడుతాడు. జయం జయం చంద్రన్న అంటూ పాట పాడడం తప్ప నేను సీఎం అవుతా ప్రజలకు పలానా చేస్తా అని చెప్పలేని చవట దద్దమ్మ పవన్ కళ్యాణ్. జోగి జోగి రాసుకుంటే బూడిద రాలుతుంది అన్న చందంగా వీరి పొత్తుతో ఒరిగేదేమీ లేదు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

# మట్టి ప్రతిమనే ఏర్పాటు చేసుకోండి

## మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున

**ప్రజాశక్తి-గుంతకల్లు**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఉత్సవ నిర్వాహకులు మట్టి వినాయ ప్రతిమలనే ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కమిషనర్ ఛాంబర్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం డివైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యోజన సమైక్య) ముద్రించిన 'మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తీవ్రస్థాయిలో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ఈనేపథ్యంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు డివైఎఫ్ఐ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మద్దికెర ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ రక్షణకై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, సురేంద్ర, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకి, నాయకులు చందు, చరణ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హిందీ దివస్

**ప్రజాశక్తి-నార్పల**

మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రాధా శ్రీదేవి అధ్యక్షతన గురువారం హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ పండితులు జూటూరు షరీఫ్ మాట్లాడుతూ హిందీ భాష జాతీయ సమైక్యతను పెంపొందిస్తుందన్నారు. హిందీ సాహిత్యంలో నేటి తరానికి కావాల్సిన నైతిక, సామాజిక, సాంస్కృతిక విలువలతో కూడిన ప్రభోద విషయాలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శింగనమల :** మండలంలోని గుత్తి రోడ్డులో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో హిందీ దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు హిందీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిఎం.రామసుబ్బారెడ్డి, సిఇఓ ప్రతాపరెడ్డి, ఎజిఎం శంకర్‌నారాయణ, ప్రిన్సిపల్ భాను, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# 'పీవీకేకే'లో ప్రాంగణ నియామకాలు

**అనంతపురం :** స్థానిక రుద్రంపేటలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో అలోహా టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ నియామకాల్లో ఎలాంటి బ్యాక్‌లాగ్స్ లేకుండా బీటెక్‌లో 60 శాతంపైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పీవీకేకే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాంగణ నియామక అధికారి భానుకిరణ్ మాట్లాడుతూ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్ పరీక్ష, సాంకేతిక ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూ నిర్వహించగా 300 మందికి పైగా హాజరుకాగా 160 మంది మొదటి పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తదుపరి పరీక్షలు మరో రెండు రోజులు జరుగుతాయన్నారు. చివరగా ఎంపికైన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి-నార్పల**

మండల కేంద్రంలోని సచివాలయం.1లో నూతనంగా మంజూరైన పింఛన్లను మార్కెట్ యార్డు ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, కులాలు, వర్గాలు, మతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, సర్పంచి సుప్రియ, జడ్పిటిసి నాగరత్నమ్మ, ఉప సర్పంచి శ్రీరాములు, అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రానికి బానిసలుగా ఎపి రాజకీయ పార్టీలు

## రాయలసీమ యునైటెడ్ ఫోరం నాయకులు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

**ప్రజాశక్తి-తాడిపత్రి**

కేంద్రం దగ్గర కట్టు బానిసలుగా ఉండటానికి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయని రాయలసీమ ఉద్యమ నేత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఈనెల 18న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 800 మీటర్ల పాలమూరు దిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు రాయలసీమ హక్కులను కాలరాస్తూ ధనిక ప్రాంతాల కొమ్ము కాస్తూ మరోసారి అభివృద్ధిని కేంద్రీకరించాలని చేస్తున్నాయన్నారు. రాయలసీమ ఎడారి అవుతున్నా కొత్త ప్రాజెక్టులను నిర్మించరు.. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. మేఘమథనాలు చేసి రాయలసీమ ప్రాంతంలో వర్షాలు కురిపించి తద్వారా చెరువులు నింపించామని ఓ ప్రభుత్వం... ట్యాంకర్ల ద్వారా పొలాలకు నీరు తరలించడంతోపాటు అధునాతనమైన రెయిన్ గన్నులతో పంటలు పండించామని మరో ప్రభుత్వం చెప్పుకుందన్నారు. ఇలాంటి పనికిమాలిన పథకాలను మాత్రమే రాయలసీమలో ప్రయోగిస్తారు తప్ప.. పోలవరం, పట్టిసీమ, పులిచెర్ల, తదితర ప్రాజెక్టులను మాత్రం పూర్తి చేసి నీరు అందివ్వరన్నారు. ఇప్పటికైనా రాయలసీమ ప్రాంత ప్రజలు మేల్కోకపోతే 'మేడిపండు' లాంటి రాయలసీమ ద్రోహుల రాజకీయ క్రీడలో పావులుగా మారి బలి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి రాయలసీమ వాసి.. మనతకు అవసరమైన, కేటాయించబడిన తాగు, సాగునీటి ప్రాజెక్టుపై రాజకీయ నాయకులను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# కిమ్స్ సవీరా వైద్యుల అత్యాధునిక చికిత్స

## రక్తనాళంలో డ్రిల్లింగ్.. స్టెంట్ అమరిక

**ప్రజాశక్తి-అనంతపురం**



అత్యాధునిక చికిత్స వివరాలను వెల్లడిస్తున్న కిమ్స్ సవీరా వైద్యులు

గుండెకు వెళ్లే రక్తనాళాలు కొద్ది మొత్తంలోనే బ్లాక్ అయితే స్టెంట్ వేస్తారు. కానీ, రక్తనాళంలో కాల్షియం బాగా పేరుకుపోతే మాత్రం అది బాగా గట్టిగా అయిపోయి స్టెంట్ కూడా వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి అరుదైన సందర్భాల్లో అత్యాధునిక చికిత్స చేస్తేనే రోగికి నయమవుతుంది. అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో ఇలాంటి అరుదైన చికిత్స చేసి, రోగికి ఊరట కల్పించారు. ఇలాంటి అరుదైన చికిత్సనే అనంతపురం సవీరా ఆసుపత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఇన్వేజివ్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎస్.బాలకిషోర్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ బి.ఫల్గుణ్ చేశారు. ఈమేరకు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

శింగనమలకు చెందిన పోతులయ్య (65) ఛాతీనొప్పి సమస్యతో ఆసుపత్రిలో చేరారు. ఆయనకు కొన్ని ప్రాథమిక పరీక్షలు చేసిన తర్వాత యాంజియోగ్రామ్ చేశాం. ఆయనకు గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో ఎడమవైపు ఉన్న ఒకే ఒక్క రక్తనాళం బాగా పూడుకుపోయింది. అయితే సాధారణ పూడిక కాకుండా, కాల్సిఫికేషన్ (కాల్షియం బాగా మందంగా పేరుకుపోవడం) ఏర్పడింది. దానివల్ల నేరుగా స్టెంట్ వేయడానికి వీలుండదు. సాధారణంగా అయితే ఇలాంటి పరిస్థితుల్లో బైపాస్ సర్జరీ చేస్తారు. కానీ, ఈ రోగికి ఒకే ఒక్క రక్తనాళం మాత్రమే ఇలా పూడిపోవడంతో దానికి బదులు రోటాబ్లేషన్ అనే అత్యాధునిక పద్ధతిని ఉపయోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రోగి రక్తనాళంలోకి ముందుగా ఒక డ్రిల్లింగ్ మిషన్ లాంటి చిన్న పరికరాన్ని పంపించినట్లు తెలిపారు. ఈ డ్రిల్లింగ్ గుండ్రంగా తిరుగుతూ, పేరుకుపోయిన కాల్షియం మొత్తాన్ని అరిగించడంతో రక్తనాళంలోని కాల్షియం మొత్తం పొడిలా మారి తీసివేయడంతోపాటు తర్వాత స్టెంట్ వేసినట్లు తెలిపారు. దీనివల్ల రోగికి బైపాస్ సర్జరీ వరకూ వెళ్లాల్సిన అవసరం లేకుండా స్టెంట్ వేసి ఊరట కల్పించినట్లు వివరించారు.

# నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

**ప్రజాశక్తి-గుత్తి**

మాట్లాడుతున్న గుత్తి మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలోని సభ మందిరంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 15 రోజులు పాటు ప్రజల ఆరోగ్యంపై ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి క్లస్టర్‌లో ఆరోగ్యంపై ప్రజలకు ఆరోగ్య కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేయించాలన్నారు. ఆరోగ్య సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు దివ్యాణి, బిందు, భార్గవి, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, ఆర్ఓ వెంకటరెడ్డి, ఆర్ఐలు షేక్షావలి, సికె.రామాంజినేయులు, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** మండల పరిధిలోని రాకెట్ల గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పావని, వెంకటేష్‌నాయక్ మాట్లాడుతూ ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశాలు సమన్వయం చేసుకుని 15 రోజులు పాటు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రక్త, గళ్ల పరీక్షల ద్వారా డెంగీ, మలేరియా, హిమోగ్లోబిన్, బిపి, షుగర్ లాంటి జబ్బులు గుర్తించి వారికి సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. గ్రామంలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను తెలియజేసి వైద్యసేవలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, సిహెచ్ఒలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**రాయదుర్గం రూరల్ :** 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపిడిఒ కొండయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మారుతి, సిడిపిఒ ప్రభావతి, ఆవులదట్ల పిహెచ్‌సి వైద్యాధికారి మధుమోహన్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ కార్యకర్త, వాలంటీర్లు గ్రామాల్లో శుక్రవారం(నేటి) నుంచి ఇంటింటా సమగ్రంగా సర్వే చేపట్టి వ్యాధుల గురించి తెలుసుకొని వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'బాబు' చేసిన నేరాలే జైలుకు పంపాయి..

## మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

టిడిపి అధినేత చంద్రబాబు చేసిన నేరాలు, మోసాలు, పాపాలే వెంటాడి జైలుకెళ్లేలా చేశాయని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని రాకెట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజల అడిగిన సమస్యలను అక్కడి అక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఇంటివద్దకే సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఇలాంటి సమయంలో సిఎం జగన్‌పై ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేయడంతోపాటు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు అరెస్టులో సిఎం జగన్‌కు ఎలాంటి ప్రమేయం లేదన్నారు. చంద్రబాబు తప్పుచేశాడు కాబట్టే జైలుకు వెళ్లాడన్నారు. ఈ విషయాన్ని స్వయానా చాలామంది టీడీపీ నాయకులు గట్టిగా నమ్ముతున్నారని వివరించారు. ఇకపోతే ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గెలుచిన నాలుగేళ్లలో ప్రజలను పట్టించుకోకుండా కేవలం అమరావతి, హైదరాబాద్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పార్టీ క్యాడర్ కూడా నిరుత్సాహంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివమ్మ, ఉప సర్పంచి రామిరెడ్డి, జడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు దెయ్యాల నాగరాజు, అశోక్‌కుమార్, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, మాజీ ఎంపిపి ఏసీ ఎర్రిస్వామి, టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు చంగల మహేష్, గట్టు ఎర్రిస్వామి, జయరాం, ఖాదర్‌బాషా, జోగి హనుమంతు, అమిద్యాల సర్పంచి శ్రీరాములు, ఎంపిటిసి ఓబయ్య, మల్లప్ప, రాకెట్ల నాయకులు నెట్యం సురేష్, మదమంచి బాబు, ఆటో సీనా, సీనానాయక్, రాజ్‌కుమార్, రామప్ప, తదితరులు పాల్గొన్నారు.

# గాడిచర్ల హరిసర్వోత్తమరావుకు నివాళి

నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

స్వాతంత్ర్య సమరయోధులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి, కార్యదర్శి రమ, మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

**యాడికి :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఒ లక్ష్మీనారాయణకు గురువారం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17ఏళ్లుగా ఫీల్డ అసిస్టెంట్లుగా పని చేస్తున్నా తమ జీవితాలు మారలేదన్నారు. కావున కనీస వేతనం నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటరాముడు, కొండారెడ్డి, గంగరాజు, రామ్మోహన్, రంగస్వామి, ధను, ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదు

## దీక్షల్లో టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-శింగనమల**

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి వేధిస్తున్న వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గురువారం అనంతపురంలోని రుద్రంపేట బైపాస్ 44వ రహదారిపైకు టిడిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ విలువలేని రాజకీయాలు చేస్తున్నాడన్నారు. ముఖ్యంగా చంద్రబాబుపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. ఈ రాక్షస పాలనను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో వైసిపికి భూస్థాపితం తప్పదని హెచ్చరించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అరెస్టు చేసి 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**అనంతపురం కలెక్టరేట్ :** సైకో జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కరువైందని టిడిపి నాయకులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదురుగా చేపట్టిన రిలే దీక్షలు గురువారం రెండవ రోజుకు చేరుకున్నాయి. కలెక్టరేట్ మీదుగా వెళ్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి కాన్వాయ్‌ను టిడిపి నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని పక్కకు లాగేశారు. ఈ దీక్షలకు టిడిపి నగర అధ్యక్షులు మారుతికుమార్‌గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్‌లు గోపాల్ గౌడ్, డిష్ నాగరాజు, నాటేష్ చౌదరి, ఎస్ఎం.భాష, బోయపాటి బాలప్ప, మారుతి నాయుడు, పరశురాం, వడ్డే మురళి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నాయకుడి పై అక్రమ కేసులు ఎత్తివేసేంతవరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గడ్డం సుబ్రమణ్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, తలారి ఆదినారాయణ, సరిపూటి రమణ, సాలార్ భాషా, గాజుల ఆదెన్న, సుధాకర్ యాదవ్, నారాయణస్వామి యాదవ్, రాజారావు, తెలుగు మహిళలు విజయ్ శ్రీ రెడ్డి, స్వప్న, బుల్లె శివ బాల, సంగా తేజస్విని, దలవాయి రమాదేవి, కృష్ణవేణి, జానకి, సరళ తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** వైసిపి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో పతనం తప్పదని విడపనకల్ టిడిపి మండల కన్వీనర్ బీడీ చినమారయ్య, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా గురువారం ఉరవకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయం పక్కన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షలకు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కేంగూరి ఎర్రిస్వామి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తిప్పారెడ్డి, తిమ్మరాజు, ధనంజయ, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వీరసింహ, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పురుషోత్తం, నాయకులు రైస్‌మిల్ రవి, రాజారెడ్డి, మహమ్మద్, బాషా, రాధాకృష్ణ, రాజాస్వామి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** మండల కేంద్రంలో 'చంద్రబాబుకు తోడు' చేపట్టిన టిడిపి రిలే నిరాహార దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. వీరికి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మద్దతు పలికి దీక్షలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చౌవా కులశేఖర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, రాము, మునిరెడ్డి, శివారెడ్డి, గోవర్ధనరాజు, రవికుమార్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసనాయుడు, తిప్పారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శింగనమల :** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. వీరికి సంఘీభావంగా సిపిఐ నాయకుల పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి టి.నారాయణస్వామి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్పయాదవ్, రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి రాము, సిపిఐ మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు, సిపిఐ నాయకులు మధుయాదవ్, నేసే మధు, లక్ష్మీరంగయ్య, ఓబిరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు

**బెలుగుప్ప :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలోని టిడిపి నాయకులు చేపట్టిన దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా టిడిపి నాయకులు చేతులకు సంకెళ్లు వేసుకుని ర్యాలీ వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మల్లికార్జున, రాము, తిప్పేస్వామి, శ్రీరాములు, బైనే నారాయణస్వామి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గం :** సిఎం జగన్ ఓ నియంత అని, రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా గురువారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి సర్కిల్‌లో రిలేదీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఏమాత్రం లేదని, అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని, అక్రమ అరెస్టుకు కారణమైన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీక్షలో నాయకులు మోరేపల్లి మల్లికార్జున, ఉన్నం మారుతి, రామ్మోహన్‌చౌదరి, వైపి.రమేష్, శ్రీనివాసరెడ్డి, గోళ్ల వెంకటేశులు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మఘట్ట :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా గురువారం స్థానిక జడ్పి హైస్కూల్ ఎదురుగా జడ్పి మాజీ ఛైర్మన్ పూల నాగరాజు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పూల నాగరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ టిడిపితో కలవడం రాష్ట్ర రాజకీయాలకు శుభ పరిమాణం అన్నారు. దీక్షలో మండల కన్వీనర్ గిరిమలప్ప, సన్నన్న, సర్పంచ్ విజయలక్ష్మి, వీరాపురం సర్పంచి నాగరాజు, మోహన్‌రంగ, గంగాధర, రంగస్వామి, కలగోడు గోవిందప్ప, దేవేంద్రప్ప, జయరామిరెడ్డి, దేవరెడ్డిపల్లి రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## మహిళ ఆత్మహత్య

గీత (పాతచిత్రం)

**గుత్తి :** మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఓ మహిళ గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన ఈడిగ గీతకు అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గురుస్వామితో తొమ్మిదేళ్ల క్రితం వివాహం అయింది. వీరి దాంపత్య జీవితం కొన్నాళ్లు బాగానే సాగింది. అయితే గీతకు సంతానం కలగలేదని గురుస్వామి తరచూ గొడవ పడేవాడు. ఈక్రమంలో వేరే మహిళతో కూడా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న గీత తండ్రి మునిస్వామి అనేకసార్లు వచ్చి అల్లుడు గురుస్వామిని మందలించి కాపురాన్ని సర్దిచెప్పాడు. అయినా గురుస్వామిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి గీత, గురుస్వామి చిన్నపాటి విషయంపై గొడవపడ్డారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన గీత భర్త నిద్రించిన అనంతరం ఇంటి పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం తెల్లవారుజామున ఇంటి పైకప్పుకు వేలాడుతూ విగతజీవి ఉన్న గీతను గమనించిన భర్త గురుస్వామి స్థానికుల సాయంతో కిందికి దింపాడు. అప్పటికే గీత మరణించిన విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి మునిస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

**పుట్లూరు :** ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండల పరిధిలోని కుమ్మనమల గ్రామానికి చెందిన కాటం మనీషా (18) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కుమ్మనమల గ్రామానికి చెందిన బాల బయన్న కుమార్తె మనీషా కడుపునొప్పి తాళలేక గతనెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే గమనించిన బంధువులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. తండ్రి బాల బయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పాముకాటుకు యువకుడు మృతి

**బొమ్మనహాల్ :** మండల పరిధిలోని లింగదహాల్ గ్రామంలో కర్రన్న (30) గురువారం పాముకాటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి వివరాల మేరకు.. కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి గ్రామానికి చెందిన కర్రన్న లింగదహాల్‌లో రోజమ్మను వివాహం చేసుకొన్నాడు. భార్య కాన్పు కోసం ఇక్కడికి రావడంతో అతడు కూడా ఇక్కడికే వచ్చి కూలి పనులు చేసుకుంటూ, ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో పాము కరిచింది. ఈ విషయం గుర్తించని కర్రన్న దానిమ్మ తోటలో కటింగ్ పనికి వెళ్లగా అక్కడ నోట్లో నురగవచ్చి స్పృహ తప్పి కింద పడిపోయాడు. తోటి కూలీలు హుటాహుటిన ఇంటికి తీసుకెళ్లగా కొద్దిసే పటి తర్వాత మృతిచెందాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, 20 రోజులు కూతురు ఉన్నారు. గ్రామస్తుల సహకారంతో కర్రన్న శవాన్ని అతడి గ్రామానికి తరలించారు.

## రెండు దుకాణాల్లో చోరీ

**బొమ్మనహాల్ :** మండల పరిధిలోని బొమ్మనహాల్ గ్రామ సమీపంలో కణేకల్లు-బళ్లారి ప్రధాన రహదారిపై గురువారం రెండు బంకుల్లో చోరీ జరిగింది. నిరుద్యోగ యువకులైన బోయ వన్నూరుస్వామి, బోయ రామాంజనేయులు వేర్వేరుగా బంకులు ఏర్పాటు చేసుకుని బీడీలు, సిగరెట్లు, శీతల పానీయాలు, తినుబండారాలు, తదితరాలు విక్రయిస్తూ తద్వారా వచ్చే ఆదాయంతో జీవనం గడిపేవారు. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బంకుల తలుపులు తీసి సరుకులు ఎత్తుకెళ్లారని, ఒక్కో బంకులో రూ. లక్ష నష్టం వాటిల్లిందని బాధిత యువకులు వాపోయారు. పోలీసులు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ప్రధాన రహదారిపై తరచూ చోరీలు జరగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**అనంతపురం క్రైం:** తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన గురువారం అనంతపురంలోని మారుతీనగర్‌లో చోటు చేసుకుంది. 4 టౌన్ సీఐ ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల మేరకు మంజునాథ అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. ఇవ్వకపోవడంతో బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గొంతువాపు వ్యాధితో గేదెలు మృతి

**బెలుగుప్ప :** మండల పరిధిలోని నరసాపురం గ్రామానికి చెందిన రైతు కిరణ్, రాజుకు చెందిన మూడు గేదెలు, రెండు దూడలు గురువారం గొంతువాపు వ్యాధితో మృతిచెందాయి. విషయాన్ని పశుసంవర్ధక శాఖ సిబ్బంది డాక్టర్ రమేష్, పశుసంవర్ధక సహాయకులు తిమ్మరాజుకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే చనిపోయిన పశువులకు పోస్టుమార్టం నిర్వహించి, రక్త నమూనాలు సేకరించి కళ్యాణదుర్గం పశు వ్యాధి నిర్ధారణ శాలకు పంపారు. పోస్టుమార్టం లక్షణాలను బట్టి చూస్తుంటే గొంతువాపు వ్యాధి లక్షణాలు ఉన్నాయని వివరించా రు. కాగా నేడు నరసాపురం గ్రామంలో అన్ని పశువులకూ గొంతువాపు వ్యాధి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మృతిచెందిన పశువుల కారణంగా రైతు కిరణ్‌కు రూ.70లు, రాజుకు రూ.30వేల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

## జిల్లాకు 1312 మెట్రిక్ టన్నుల యూరియా

**అనంతపురం :** జిల్లాకు కేటాయించిన 1312 మెట్రిక్ టన్నుల నాగార్జున ఫర్టిలైజర్ యూరియా గురువారం చేరినట్లు ఎడిఎ ఎం.రవి తెలిపారు. ఈమేరకు స్థానిక ప్రసన్నాయపల్లి రేక్ పాయింట్‌లో తనిఖీ చేసి గోదాములో నిల్వ ఉంచిన స్టాకు వివరాలను కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణికి సమాచారం అందించినట్లు తెలిపారు. వారి సూచనలు మేరకు ప్రయివేట్ డీలర్లు, సొసైటీలకు కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు.

## మాజీమంత్రి 'కాలవ'కు పరామర్శ

**పుట్లూరు :** మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వారం రోజుల కిందట విజయవాడలో అనారోగ్యంతో ఆసుపత్రులు చేరి కోలుకుని ఇంటికి రావడంతో పలువురు నాయకులు గురువారం పరామర్శించారు. కాలవను కలిసిన వారిలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నాయుడు, మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు రామాంజనేయులు, ఆదినారాయణరెడ్డి, తదితరులు వెళ్లి పరామర్శించారు.

## ఓపెన్ డిగ్రీ దరఖాస్తు గడువు పొడిగింపు

**ఉరవకొండ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి ఓపెన్ డిగ్రీలో బిఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి ఈనెల 30వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు ఉరవకొండ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, రెండు సంవత్సరాల ఐటిఐ, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈనెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం అధ్యయన కేంద్రాన్నిగానీ, సెల్.. 73829 29762 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

**పెద్దవడుగూరు :** స్థానిక ఆర్డీటీ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బుక్కరాయసముద్రం ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి ఉన్నత పదవులను పొందాలన్నారు. ప్రస్తుతం సమాజంలో చదువే ప్రామాణికమని చదువులేకుంటే జ్ఞానాన్ని సమపార్జించుకోలేమన్నారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ నారాయణ, ఎస్టిఎల్ సావిత్రి, సీవో మంజుల, తదితరులు పాల్గొన్నారు..

## నేడు 'జగనన్నకు చెబుదాం.. స్పందన'

**గుత్తి :** పట్టణంలోని నిజామీ షాదీఖానాలో శుక్రవారం జగనన్నకు చెపుదాం.. స్పందన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషా గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఉన్నతాధికారులు, మండలాధికారులు సంప్రదించాలన్నారు.